సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 12 । జూలై । 2024



సోమశిలలో 9.95 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 9.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 144 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,160
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,750
3 శాతం జీఎస్టీతో	రూ.6,953
నవర (8 గ్రా)	రూ.55,624

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4 /25.7


గాలిలో తేమ 56 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా ఆకాశం శుక్రవారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వందనం పేరిట వంచన

తల్లికి వందనం అంటూ నాడు ప్రగల్భాలు

- ఎంత మంది ఉంటే అందరికీ రూ.15 వేలు ఇస్తానని హామీ
- తాజాగా ఒకరికే వర్తిస్తుందంటూ జీఓ
- యూటర్న్‌కు చంద్రబాబు కేరాఫ్ అని మరోసారి రుజువు
- ఫీజులెలా చెల్లించాలో అర్థంకాక ఆందోళనలో తల్లిదండ్రులు
- గత ప్రభుత్వ హయాంలో విద్యాసంస్థల ప్రారంభం నాటికే అమ్మఒడి

'తల్లికి వందనం కింద సంవత్సరానికి ప్రతి ఒక్క బిడ్డకు రూ.15 వేలు ఇచ్చే బాధ్యత నాది.. ఒకరు అనే నిబంధన లేదు.. ఇద్దరు ఉంటే ఇద్దరికి ఇస్తా.. ముగ్గురు ఉంటే ముగ్గురికి ఇస్తా.. నలుగురు ఉంటే నలుగురికి ఇస్తా.. ఏమంటారు మీరు..' ఈ మాటలు అంది ఎవరో కాదు.. సాక్షాత్తు ప్రస్తుత సీఎం.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన సభలో ఆయన ఇచ్చిన ఈ హామీతో రాష్ట్రంలోని ఎందరో తల్లుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వమిచ్చే ఈ మొత్తంతో తమ పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపి వారిని ఉన్నత చదువులను చదివించొచ్చని కలలుగన్నారు. చివరికి ఏమైంది.. అనుకుందే అయింది. తన పాత పంథాను తెరపైకి తీసుకొచ్చిన ఆయన తాజాగా ఈ పథకానికి కొర్రీలు వేశారు. ఎంత మంది పిల్లలున్నా, ఒకరికే పథకం వర్తిస్తుందంటూ హడావుడిగా జీఓను జారీ చేశారు. ఆయన హామీని విశ్వసించి ఓట్లేసిన ప్రజలను నిస్సిగ్గుగా వంచించారు. ఈ హఠాత్పరిణామంతో తమ పిల్లల చదువులకు ఫీజులను ఎలా చెల్లించాలనే ఆందోళనలో తల్లిదండ్రులు కొట్టుమిట్టాడుతున్నారు.



నెల్లూరు (టౌన్): సీఎం చంద్రబాబు నిజస్వరూపం మరోసారి బయటపడింది. అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యంగాని హామీలను గుప్పించడం.. ఆపై విస్మరిస్తారని తనకు ఉన్న పేరును మరోసారి నిలబెట్టుకున్నారు. తాజాగా ఆయన వంచన రాజకీయాలకు మొదటి బీజం 'తల్లికి వందనం'పై పడింది. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేల చొప్పున అందిస్తానని ఎన్నికల సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ప్రచారం చేసేందుకు అనువుగా ఇదే పథకాన్ని సూపర్ సిక్స్ పేరిట రూపొందించిన మేనిఫెస్టోలో సైతం పొందుపర్చారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన ఆయన ప్రమాణ స్వీకారం చేసి పట్టుమని నెల గడవక ముందే తన పాత పంథాకు మరింత పదును పెట్టి ఈ పథకంపై అమలుపై యూటర్న్ తీసుకున్నారు.

హడావుడిగా జీఓ జారీ

విద్యాసంస్థలను ప్రారంభించి దాదాపు నెలకుపైగా అవుతోంది. తల్లికి వందనం పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడం, మరోవైపు ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిణామ క్రమంలో పథకానికి సంబంధించిన జీఓను హడావుడిగా బుధవారం రాత్రి జారీ చేశారు. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా, ఒకరికే వర్తిస్తుందంటూ జీఓలో పేర్కొనడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. బాబుకు ఓటేసి మరోసారి వంచనకు గురయ్యామని పలువురు ఆరోపించారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుతుందనే..!

హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తే ఈ విద్యా సంవత్సరంలో 1.5 లక్షల మందికిపైగా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలను బడికి, కళాశాలలకు పంపిస్తే అంత మందికి ఈ పథకాన్ని అమలు చేస్తామని తొలుత ప్రకటించారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే పథకాన్ని అమలు చేస్తారా లేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకూ వర్తింపజేస్తారాననే అంశంపై జీఓలో స్పష్టత లేదు. ఈ పథకానికి ఇంకా ఎలాంటి నిబంధనలను తెరపైకి తీసుకొస్తారోననే ప్రశ్నా తలెత్తుతోంది. ఏదేమైనా ప్రభుత్వ తీరుతో తల్లిదండ్రులు అప్పులు చేసి తమ పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇవీ నిబంధనలు..

తల్లికి వందనం పథకానికి నూతన ప్రభుత్వం పలు నిబంధనలను అమలు చేయనుంది. వీటినైనంత మంది పిల్లలను ఈ పథకానికి దూరం చేసేలా కుట్రలను తెరపైకి తీసుకొస్తున్నారు. పాఠశాలల్లో పిల్లలకు 75 శాతం హాజరు తప్పనిసరని ప్రకటించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల పిల్లలకే ఈ పథకాన్ని వర్తింపజేస్తామని జీఓలో పొందుపర్చారు. ముున్ముందు చంద్రన్న సిత్రాలు ఇంకా ఎలా ఉంటాయోననే చర్చ సర్వత్రా జరుగుతోంది.

టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో లోగో

నాడంతా సజావుగా..

జిల్లాలో 3431 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు.. 208 జూనియర్ కళాశాలలున్నాయి. పాఠశాలల్లో 3,54,779 మంది.. జూనియర్ కళాశాలల్లో 56 వేల మందికిపైగా విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకాన్ని సమర్థంగా అమలు చేశారు. ఒకటో తరగతి మొదలుకొని ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. కొన్ని నిబంధనలతో పథకాన్ని పటిష్టంగా కొనసాగించారు. విద్యాసంస్థలను ప్రారంభించిన వారంలోనే ఈ పథకానికి సంబంధించిన రూ.15 వేలను విద్యార్థుల తల్లి ఖాతాల్లో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమ చేసేవారు. దీంతో తమ పిల్లలను మంచి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించి చదివించుకోగలిగారు. ఈ పథకాన్ని తొలి రెండేళ్లు ఉమ్మడి జిల్లా కింద అమలు చేశారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో పాఠశాల స్థాయిలో 1,94,842 మందికి.. కళాశాల స్థాయిలో 31500 మందికి అమ్మఒడి పథకాన్ని వర్తింపజేశారు.

అమ్మఒడి ద్వారా గతంలో అందించిన మొత్తం

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.కోట్లల్లో)
2020	2,51,811	377.71
2021	4,07,272	610.90
2022	2,31,866	347.79
2023	2,26,205	339.30

ఇంటిల్లిపాది ఓటేశాం



నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం అందింది. ఎంత మంది ఉంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేస్తామని చంద్రబాబు ప్రకటించడంతో ఇంటిల్లిపాది ఆయనకే ఓటేశాం. ఇప్పుడు ఒకరికే అంటూ జీఓను జారీ చేయడం దుర్మార్గం.

– అమృత, కొత్తూరు, నెల్లూరు రూరల్

మాట మార్చిన బాబు



నా ఇద్దరు పిల్లలు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఐదు, ఏడో తరగతి చదువుతున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం ద్వారా నగదు ఇద్దరికీ అందాలి. అయితే ప్రస్తుతం ఒకరికే ఇస్తామని జీఓ జారీ చేయడంతో షాక్‌కు గురయ్యా. నిర్ణయంపై మరోసారి ఆలోచించాలి.

– సంపూర్ణ, వరికుంటపాడు

మోసం చేయడం సరికాదు



చంద్రబాబు ఇచ్చిన హామీని నమ్మి నా ఇద్దరు ఆడపిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించా. ఇద్దరికి రూ.30 వేలు ఇస్తే ఫీజులు కట్టుకోవడం సులభంగా ఉంటుంది. నాకు భర్త లేదు. పిల్లలను నేనే పోషించుకోవాలి. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆందోళన కలిగిస్తోంది. ఫీజులెలా చెల్లించాలో అంతుచిక్కడంలేదు.

– బండి మౌనిక, టెక్కేవీధి, ఆత్మకూరు

ఉసురు తగులుతుంది



నాకు ఇద్దరు పిల్లలు. చేజర్ల మెయిన్ పాఠశాలలో బాబు చదువుతున్నాడు. తల్లికి వందనం పథకంలో ఇద్దరికీ నగదు వస్తే చదువులకు ఉపయోగపడతాయని ఆశించా. ఇప్పుడు ఒకరికే అందజేయనున్నారని తెలిసింది. ఇలా అబద్ధాలు చెప్పి మోసం చేయడం తగదు. మా ఉసురు తగులుతుంది.

– సుప్రియ, చేజర్ల

పిల్లలందరికీ వర్తింపజేయాలి



నా ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్నా. గత ప్రభుత్వంలో అమ్మఒడి ద్వారా రూ.15 వేలు అందేవి. ఈ క్రమంలో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ద్వారా ఏటా రూ.15 వేలను ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. పిల్లలందరికీ వర్తిస్తుందని ఆశించినా, అది జరిగేలా లేదు.

– సానా కుమారి, సత్యనారాయణపురం, నెల్లూరు

మాలాంటి వారికి భారమవుతుంది



పాఠశాలలు ప్రారంభమై నెలవుతోంది. మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. తల్లికి వందనం పథకాన్ని ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక బిడ్డకే పథకాన్ని వర్తింపజేస్తారని తెలిసింది. మాలాంటి పేదలకు భారంగా మారుతుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు అమలు చేయాలి.

– విజయ, కేఆర్‌పురం, మనుబోలు

ప్రతిసారి మోసపోతున్నాం



ఎన్నికల సమయాల్లో చంద్రబాబు మాటలను నమ్మి మోసపోవడం సర్వసాధారణమైంది. నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నా. ఆయన ఇచ్చిన హామీ మేరకు రూ.30 వేలు అందాలి. ఇప్పుడు ఒకరికే ఇస్తామనడం దారుణం. తల్లికి వందనం పథకానికి నిబంధనలను విధించడం తగదు.

– స్వాతి, కోవూరు

జీఓ విడుదలైంది

తల్లికి వందనం పథకానికి సంబంధించిన జీఓను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. హాజరు 75 శాతం తప్పక ఉండాలి. పథకానికి సంబంధించిన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గతంతో పంపేవారు. ఈ డేటా ఉంది. పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇప్పటి వరకు రాలేదు.

– రామారావు, డీఈఓ

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ ఆనంద్ అదనపు బాధ్యతలను స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా ఉన్న వికాస్ మర్మత్‌ను కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో గురువారం ఆయన రిలీవయ్యారు. రెగ్యులర్ కమిషనర్ వచ్చేంత వరకు ఇన్‌చార్జిగా కలెక్టర్ వ్యవహరించనున్నారు. కాగా ఐఏఎస్ హోదా అధికారే కమిషనర్‌గా రావొచ్చని కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ట్రిపుల్ ఐటీలో 218 మందికి సీట్లు

నెల్లూరు (టౌన్): రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో జిల్లాకు చెందిన 218 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు గత నెల్లో ఆన్‌లైన్ ద్వారా ట్రిపుల్ ఐటీల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సీట్లను గురువారం కేటాయించారు. నూజివీడు కళాశాలలో 61.. ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ కళాశాలలో 89.. ఒంగోలు కళాశాలలో 41.. శ్రీకాకుళంలోని కళాశాలలో 27 మందికి సీట్లు కేటాయించారు.

ఉద్యోగాలకు 192 మంది ఎంపిక

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఉద్యోగాలకు 192 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌కు 13 కంపెనీలు హాజరయ్యాయని చెప్పారు. ప్లేస్‌మెంట్ అధికారి చెంగళ్‌రాయన్, జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టోన్‌హౌస్‌పేటకు చెందిన దివ్యాంగుడు సందానీబాషాకు వీల్‌చైర్‌ను ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ నిర్వాహకురాలు పర్వీన్ గురువారం అందజేశారు. విశ్వమాత సేవా ఫౌండేషన్ నిర్వాహకురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రీచ్‌లను పీల్చి పిప్పి చేస్తూ..

పడమటి కంభంపాడులో అక్రమ తవ్వకాలు

- భారీ యంత్రాలతో కొల్లగొడుతూ..
- రెండు రోజులుగా యథేచ్ఛగా ఇసుక తరలింపు
- పట్టించుకోని అధికారులు
- అధికార పార్టీ నేతల అండతోనే..



లారీలో ఇసుకను లోడ్ చేస్తున్న యంత్రం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలోని ఇసుక రీచ్‌లను టీడీపీ నేతలు పీల్చి పిప్పి చేస్తున్నారు. పెన్నా గర్భాన్ని చీల్చేసి యథేచ్ఛగా తోడేస్తున్నారు. అక్రమ రవాణా బహిరంగంగా జరుగుతున్నా, తమకేమీ పట్టదనే రీతిలో అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది.

దోపిడీకి వెన్నుదన్నుగా..

రీచ్‌లలో బహిరంగ దోపిడీకి అధికారులే వెన్నుదన్నుగా ఉంటూ అక్రమ రవాణాలో భాగస్వాములవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిన్నామొన్నటి వరకు డంపింగ్ యార్డుల్లో ఉన్న ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్న అధికార పార్టీ నేతల కన్ను తాజాగా ఆత్మకూరు నియోజకవర్గంలోని పడమటి కంభంపాడు రీచ్‌పై పడింది. ఈ తరుణంలో రాయలసీమ ప్రాంతానికి చెందిన అక్రమార్కులు స్థానిక టీడీపీ నేతలతో కుమ్మక్కై దోపిడీని సాగిస్తున్నారు.

అనధికార లైసెన్స్..!

సోమశిల సమీపంలోని పడమటికంభంపాడు రీచ్‌లో ఈ దందా రెండు రోజులుగా సాగుతోంది. టీడీపీ నియోజకవర్గ స్థాయి నేతలు అనధికార లైసెన్స్‌లు జారీ చేసి ఇసుకను కొల్లగొట్టేందుకు సహకారం అందిస్తున్నారు. రెండు భారీ యంత్రాలతో తోడేస్తూ అక్రమ రవాణా సాగిస్తున్నారు. నిత్యం వందకుపైగా వాహనాల్లో తరలిపోతోంది. ఒక్కో టిప్పర్ ద్వారా దాదాపు ఐదు యూనిట్లు.. ఈ విధంగా చూస్తే వంద వాహనాలకు రోజూ 500 యూనిట్లు.. మొత్తంగా 20 వేల టన్నుల మేర అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఆధారంగా లెక్కిస్తే, తరలించిన ఇసుక విలువ దాదాపు రూ.74 లక్షల వరకు ఉంటుందని సమాచారం.

రీచ్‌లపై నిర్ణయం రాకుండానే..

వాస్తవానికి రీచ్‌లపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ప్రజావసరాల దృష్ట్యా డంపింగ్ యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకకే ధర నిర్ణయించి సరఫరా చేస్తోంది. అయితే అధికార పార్టీ నేతలు బరితెగించి విచ్చలవిడిగా అక్రమ రవాణా సాగిస్తున్నారు.

మైనింగ్ శాఖ పరిధిలోనే అనుమతులు

పడమటి కంభంపాడు రీచ్‌లో తవ్వకాలకు అనుమతులివ్వలేదు. ప్రభుత్వ పాలసీనే విడుదల కాలేదు. అనుమతులు మైనింగ్ శాఖ పరిధిలో ఉంటాయి. ఇందులో మాకెలాంటి సంబంధం లేదు.

– రమేష్, ఆర్‌ఐ, అనంతసాగరం మండలం

ఇతర రాష్ట్రాలకు తరలింపు

ఇక్కడి ఇసుకకు ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉంది. నిర్మాణాలకు దీన్ని అధికంగా ఉపయోగిస్తారు. ఈ తరుణంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఒక్క టిప్పర్ ఇసుక ధర ఇతర రాష్ట్రాల్లో రూ.90 వేల వరకు పలుకుతోంది. దీంతో పోలీసులు, రెవెన్యూ, ఆర్టీఏ, మైనింగ్ శాఖల అధికారులకు అక్రమార్కులు నెలవారీ మామూళ్లు సమర్పిస్తూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. మరోవైపు అక్రమ దందాపై మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా, ఫోన్లు తీయడాన్ని సైతం మానేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

నేత్రపర్వంగా 16 రోజుల పండగ



కల్యాణ వేదికపై ఆశీనులైన వెంగమాంబ



మహిళల కోలాట ప్రదర్శన

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారి 16 రోజుల పండగను వేడుకగా గురువారం నిర్వహించారు. దేవస్థానం, ఆలయ గర్భగుడిని వివిధ రకాల కూరగాయలు, పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వెంగమాంబ అమ్మవారు, గురవయ్యస్వామి దంపతులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలను సమర్పించారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ఇతర వాహనాలకు పూజలు చేయించారు. మహిళల కోలాట ప్రదర్శన అలరించింది.

భూగర్భ జలాలను పెంపొందించేలా ప్రణాళికలు



కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో భూగర్భ జలాలను పెంపొందించేలా ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమాన్ని కేంద్ర భూగర్భ జలమండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చేపట్టే చెక్ డ్యామ్‌లు, వాటర్‌షెడ్లలో భూగర్భ జలాలు నిల్వ ఉండేలా డిజైన్లను రూపొందించాలని చెప్పారు. జిల్లాలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగునీటిని వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కేంద్ర భూగర్భ జలమండలి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లాలో భూగర్భజలాల పరిస్థితులను వివరించే ఫొటో ప్రదర్శనను తిలకించారు. కేంద్ర భూగర్భ జలమండలి డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, శాస్త్రవేత్త రవికుమార్, డ్వామా పీడీ శ్రీనివాసులు, ఏపీడీ శంకర్, జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెమ్మెమ్మెస్‌కు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్నెమ్మెమ్మెస్)కు ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2020, 21, 22, 23లో ఎంపికైన విద్యార్థులు రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ లేదా ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www. bse.ap.gov.inను సంప్రదించాలని సూచించారు. మెరిట్ లిస్ట్‌లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరులో ఏమైనా తప్పులుంటే సంబంధిత స్కూల్ ద్వారా ఎగ్జామినేషన్ సెక్షన్, జెడ్పీ హైస్కూల్, దర్గామిట్టను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యశ్రీలో జీజీహెచ్‌కు తృతీయ స్థానం



మాట్లాడుతున్న సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా అందించే సేవల్లో నెల్లూరు జీజీహెచ్‌కు తృతీయ స్థానం లభించిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ తెలిపారు. పెద్దాస్పత్రిలోని తన చాంబర్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గతంలో పదో స్థానంలో ఉన్న నెల్లూరు జీజీహెచ్ ఇప్పుడు మూడో స్థానానికి చేరిందని, త్వరలో నంబర్‌లో వన్‌కు తీసుకొస్తామని ప్రకటించారు. నెల్లూరులోని జీజీహెచ్‌కు 940 ఆరోగ్య సేవలను గత నెల్లో లక్ష్యంగా నిర్దేశించగా, తాము 1152 మందికి ఆపరేషన్లు, కాన్పులు, ఇతర సేవలను అందించామని వివరించారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రొఫెసర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అక్రమ్ పర్యవేక్షిస్తూ పేద రోగులకు అండగా ఉన్నారన్నారు. ప్యాథాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీకి సంబంధించిన అన్ని రకాల పరీక్షలను నూతన భవనంలోని సెంట్రల్ ల్యాబ్‌లో త్వరలో ప్రారంభించనున్నామని వెల్లడించారు. సీఎస్సార్ నిధులతో ఐసీఐసీఐ బ్యాంక్ సమకూర్చిన బ్లడ్ బ్యాంక్ కాంపొనెంట్ యంత్రాన్ని ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. రోగుల కోసం వరండాలో సరిపడా ఫ్యాన్లు, లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాజ్యువాల్టీ విభాగానికి పది మంది వైద్యులు త్వరలో రానున్నారని చెప్పారు.

క్లుప్తంగా

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: నెల్లూరులో రొట్టెల పండగ నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్‌పేట దర్గాలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, వారి కోసం సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ కె.మధులత ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం దర్గా నిర్వాహకులు, వక్ఫ్ బోర్డు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. దర్గా, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి వసతిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలని ఆమె కోరారు. తాను సైతం తనిఖీలు చేస్తానన్నారు.

త్వరలో ఏఓ నియామకం


మాట్లాడుతున్న సత్యవాణి

అల్లూరు: త్వరలో అల్లూరు అగ్రికల్చర్ అధికారిని నియమించనున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి సత్యవాణి తెలిపారు. గురువారం ఆమె అల్లూరు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఖాళీగా ఉన్న అల్లూరు ఏఓ స్థానాన్ని భర్తీ చేయడం జరుగుతుందన్నారు. పలువురు రైతులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏడీఏ నాగరాజు, రైతు నాయకులు మేడా నిరంజన్‌రెడ్డి, కృష్ణచైతన్య, కత్తుల కిరణ్, మేడా శ్రావణ్, శరత్, ఆనంద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దుకాణంలో నగదు చోరీ

నెల్లూరు(క్రైమ్): సింహపురి పెయింట్స్ షాపు తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని దుండగులు నగదు దోచుకెళ్లిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంతపేటకు చెందిన కె.సూర్యనారాయణ సుబేదారుపేట సెయింట్ జోసఫ్స్ హాస్పిటల్ ఎదురుగా సింహపురి పెయింట్స్ పేరిట షాపు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే 10వ తేదీ రాత్రి షాపు మూసివేసి ఇంటికెళ్లారు. గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు దాని తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదు అపహరించుకెళ్లారు. బాధితుడు ఉదయం షాపు తెరిచి ఉండటాన్ని చూసి లోనికి వెళ్లగా క్యాష్ కౌంటర్‌లో నగదు కనిపించలేదు. ఈ మేరకు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కిరణ్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	127
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	256
లేయర్ చికెన్ :	187



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.55
సన్నవి :	రూ.40
పండ్లు :	రూ.30



టీడీపీలో పదవులాట

- నామినేటెడ్, పార్టీ స్థానాల కోసం నేతల పైరవీలు
- పాత, కొత్త నేతల మధ్య పోటీ
- ఏఎంసీ కుర్చీ కోసం ముమ్మర ప్రయత్నాలు



ఉదయగిరి: తెలుగుదేశం అధికారంలోకి రావడంతో ఉదయగిరి నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు పదవుల కోసం పైరవీలు మొదలుపెట్టారు. ఫలితాలు వెలువడిన నాటి నుంచే కొందరు నామినేటెడ్, మరికొందరు పార్టీ పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేతలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. దీంతో రాజకీయం వేడెక్కింది. మొదటి నుంచి పార్టీ కోసం కష్టించి పనిచేసిన తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పాత నేతలు అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఇబ్బందిగా మారినట్లు చర్చ నడుస్తోంది. ఆయన రాజకీయాలకు కొత్త కావడంతో ఈ పరిస్థితిని ఎలా అధిగమిస్తారోనని తెలుగు తమ్ముళ్లు ఆసక్తిగా చూస్తున్నారు.

వీటి కోసం..

అత్యంత కీలకమైన ఉదయగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం నియోజకవర్గంలోని నేతల్లో తీవ్ర పోటీ నెలకొంది. పార్టీలో చేరి తన విజయం కోసం పని చేస్తే ఈ పదవి ఇస్తానని సురేష్ చెప్పడంతో వింజమూరుకు చెందిన ఓ నేత టీడీపీ తీర్థం పుచ్చుకున్నాడు. ఈయన చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడైన కంభం విజయరామిరెడ్డి తన తనయుడికి ఇప్పించుకునేందుకు పావులు కదుపుతున్నారని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారంలో ఉంది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి కూడా ఈ పదవి ఆశిస్తున్న వారిలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి శాంతమ్మ తనను ఏఎంసీ చైర్‌పర్సన్ చేయాలని పట్టుబడుతున్నట్లు తెలిసింది. అయితే ఆమెకు టీటీడీ పాలకవర్గంలో స్థానం కల్పిస్తే ఏఎంసీ రేసు నుంచి తప్పుకుంటారనే ప్రచారం కూడా ఉంది. పదవి ఆశిస్తున్న వారిలో పాత, కొత్త నేతలున్నారు. ఎవరికి వారు తమకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో మీ కోసం పనిచేశామని ఆయనకు చెబుతున్నారు. అయితే కొత్త నేతలకు ఇస్తే సహించేదిలేదని పాత నాయకులు స్పష్టం చేసినట్లు ప్రచారం ఉంది. అదే విధంగా సహకార సంఘాల చైర్మన్ పోస్టు కోసం కూడా పార్టీ కేడర్‌లో పోటీ నెలకొంది. మండలాల వారీగా ఎవరికి ఇవ్వాలోనని ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. పలువురు నేతలు తమ మనస్సులోని మాటను కాకర్లకు నేరుగా చెప్పకుండా ఆయన సన్నిహితుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు.


ఉదయగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం

కీలకమైనవి కావాలంటూ..

మండలస్థాయిలో కీలకమైన పార్టీ పదవుల కోసం టీడీపీ నేతలు జోరుగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా మండల కన్వీనర్ల పోస్టుల విషయంలో పోటీ అధికంగా ఉంది. కొంతమంది బొల్లినేని రామారావు అనుచరులు ఎన్నికల్లో సురేష్‌ను ఇబ్బంది పెట్టారు. ఈ నేపథ్యంలో వారికి ప్రాధాన్యం తగ్గించాలని ఎమ్మెల్యే వర్గం డిమాండ్ చేస్తోంది. దీనికి సంబంధించి జాబితా కూడా సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పలువురిని తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాకర్లను ఓడిస్తానని బహిరంగంగా చెప్పిన బొల్లినేనితో తెరచాటున పని చేసిన వారిపై కాకర్ల గుర్రుగా ఉన్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

ప్రసన్నం చేసుకునేందుకు..

రాజకీయాల్లోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే కాకర్లకు ఎమ్మెల్యే యోగం దక్కింది. నియోజవర్గంలోని గ్రామాలు, వాటిల్లో నేతలు ఎవరో కూడా పూర్తి అవగాహన కాలేదు. ఈ నేపథ్యంలో గ్రామస్థాయిలో ఉండే పలు పోస్టులు, పదవుల నిమిత్తం ఎమ్మెల్యే లెటర్ల కోసం చాలామంది అడుగుతున్నారు. అయితే ఒకే గ్రామంలో అనేక గ్రూపులు ఉండటం, వాస్తవంగా పార్టీ గెలుపు కోసం ఎవరు పనిచేశారో.. లేదో కూడా తెలియని పరిస్థితుల్లో పూర్తి అవగాహన కోసం ఆయన ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఎన్నికలకు ముందు పట్టీపట్టనట్లుగా ఉన్న కొందరు నేతలు, పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

వాటర్ ప్లాంట్ పేరు మార్పుపై వివాదం

మనుబోలు: మండలంలోని అక్కంపేట గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంట్ పేరు మార్పు విషయమై గురువారం వివాదం నెలకొంది. అక్కంపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు నారపరెడ్డి కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ 2017లో రూ.5 లక్షలు సొంత నిధులు వెచ్చించి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉచితంగా మంచినీరు అందిస్తున్నామన్నారు. దివంగత వైఎస్సార్‌పై ఉన్న అభిమానంతో ప్లాంట్‌కు రాజన్న జలధార అని పేరు పెట్టామన్నారు. టీడీపీ కార్యకర్తలు ప్లాంట్ వద్ద ఎన్టీఆర్ జలధార పేరుతో బోర్డును ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ముద్దుమూడి గ్రామంలో కూడా తాను పెట్టిన వాటర్ ప్లాంట్ వద్ద రాజన్న జలధార బోర్డును తొలగించారని వాపోయారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన దళిత యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బెదిరించి ఊరొదిలి పోయేలా చేశారన్నారు. అరాచక పాలన సాగిస్తే టీడీపీని ప్రజలు సాగనంపడం ఖాయమన్నారు. జగన్‌కు ఫొటోల పిచ్చి అని విమర్శించిన టీడీపీ వారు ఇప్పుడు పాఠశాలల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, సోమిరెడ్డిల ఫొటోలు ఎలా పెడతారని ప్రశ్నించారు.



వాటర్ ప్లాంట్ వద్ద ఎన్టీఆర్ జలధార బోర్డు

- ప్లాంట్‌ను పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఎస్సై అజయ్‌కుమార్ పరిశీలించారు. స్థలానికి సంబంధించి రికార్డులను ఎంపీడీఓ పరిశీలిస్తారని వెల్లడించారు.

వికాస్ మర్మత్‌కు ఘన సన్మానం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన వికాస్ మర్మత్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలోని సమావేశ మందిరంలో గురువారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల ఉన్నతాధికారులు మాట్లాడుతూ వికాస్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విశిష్ట సేవా పురస్కారాలు అందుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గడిచిన 15 నెలల కాలంలో కమిషనర్‌గా ఆయన చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, సంస్కరణలు అభినందనీయమని పలువురు అభినందించారు. భవిష్యత్‌లో జిల్లా కలెక్టర్‌గా రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎస్‌ఎంసీ తయారు చేయించిన వస్త్ర సంచులను ఆవిష్కరించారు. మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వికాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవీకుమారి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మేనేజర్ ఇనాయతుల్లా, ఉద్యోగ సంఘాల నాయకులు శీనయ్య, చక్రపాణి, కృష్ణకిశోర్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


గజమాలతో వికాస్ మర్మత్‌కు సత్కారం

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- నాయకులు, కార్యకర్తలకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా

మనుబోలు: 'ఎన్నికల్లో ఓడిపోయామని నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు. మీకు నేను అండగా ఉంటా' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మనుబోలులోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే నిజమైన రాజకీయ నాయకుడి లక్షణమన్నారు. గతంలో గ్రామాలను యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి చేసేవారన్నారు. ఇందుకు భిన్నంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని సంక్షేమ పథకాలను అందించి, పాలనలో కొత్త విప్లవాన్ని తీసుకొచ్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యక్తిని యూనిట్‌గా తీసుకుని వారి అభివృద్ధే ధ్యేయంగా పథకాలు అమలు చేసి ఆర్థికంగా భరోసా కల్పించినట్లు చెప్పారు. అయినా ఓడిపోయామంటే పొరపాటు ఎక్కడ జరిగిందో విశ్లేషించుకుంటామన్నారు. లోటుపాట్లను సరిదిద్దుకుని ముందుకు సాగుతామన్నారు. చంద్రబాబుకు మాట తప్పడమనే అలవాటు ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రకటించారని, తీరా అధికారంలోకి వచ్చాక ఉచితమంటే ఇంటికి తీసుకొచ్చి ఇస్తామా అని ప్రశ్నిస్తున్నాడన్నారు. గతంలో బాబు కరెంట్ చార్జీలపై మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలు వేయబోమని, మీటర్లు బిగించబోమని చెప్పాడన్నారు. ఇప్పుడు వాటిపై స్పష్టత ఇవ్వకుండా శ్వేతపత్రం పేరుతో తమ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఎన్నికల్లో జయాపజయాలు సహజమని, ఓడిపోయిన పార్టీలు పుంజుకుని మళ్లీ ఘన విజయం సాధించిన సంఘటనలు చరిత్రలో చాలా ఉన్నాయన్నారు.

దాడులు చేస్తే ఉపేక్షించం

ఎవరైనా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి వస్తే ఉపేక్షించేది లేదని కాకాణి తెలిపారు. ఈ క్రమంలో కేసులు, పోలీసులు ఎదురైనా భయపడేది లేదని, జైలుకు వెళ్లడానికైనా సిద్ధమన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఏదైనా చేయాలనుకుంటే ముందు తనను దాటుకుని వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని 2029లో మళ్లీ తాము భారీ మెజార్టీతో అధికారంలోకి వస్తామన్నారు. కార్యకర్తలు ఓపికగా ఎదురుచూడాలని తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారి వెన్నంటి ఉంటామన్నారు. సమావేశంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, గుమ్మడి వెంకటసుబ్బయ్య, కసిరెడ్డి ధనంజయరెడ్డి, జానకిరామిరెడ్డి, భాస్కర్‌గౌడ్, ఆవుల తులసీరాం, గుంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతో దేశాభివృద్ధి


ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ, ఇతర అధికారులు

నెల్లూరు(అర్బన్): 'జనాభా నియంత్రణతో దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. ఇందుకోసం కుటుంబ నియంత్రణ పద్ధతులు ఆచరించాలి. ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకోవాలి' అని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. దీనిని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ములుమూడి బస్టాండ్, బీఈడీ కళాశాల మీదుగా సాగింది. అనంతరం కార్యాలయంలో సభ జరిగింది. జనాభా నియంత్రణలో భాగస్వాములవుదామని డాక్టర్‌లు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నీరు, గ్యాస్, బొగ్గు తదితర సహజ వనరులు పరిమితంగా ఉంటాయన్నారు. జనాభా పెరిగితే వాటిని వినియోగించుకోవడంలో ఇబ్బందులు తప్పవన్నారు. అందువల్ల తప్పనిసరిగా జనాభా నియంత్రణ జరగాలని, లేదంటే సమతుల్యం దెబ్బతింటుందన్నారు. ఇందులో భాగంగా బాల్యవివాహాలను అరికట్టాలని, యుక్తవయస్సులో మాత్రమే పెళ్లిళ్లు జరిపించాలన్నారు. కుటుంబ నియంత్రణ పాటించిన వారికి సంబంధించి లక్కీడిప్ తీశారు. ముగ్గురికి మొదటి బహుమతి కింద రూ.5 వేలు చొప్పున, మరో ముగ్గురికి రెండో బహుమతి కింద రూ.4 వేలు చొప్పున అందించారు. అధికంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్ సీహెచ్ కిరణ్‌కు మొదటి బహుమతి కింద రూ.8 వేలు, డాక్టర్ పద్మావతికి రెండో బహుమతి కింద రూ.5 వేలు, పీపీ యూనిట్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక బహుమతి అందజేశారు. అలాగే ఫ్యామిలీ ప్లానింగ్ కౌన్సిలర్, ఏఎన్‌ఎం, ఆశాలకు రూ.2,500 చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ రమేష్, డెమో అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం, ఎస్‌ఓ సహన, పీహెచ్‌సీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ఆర్‌ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పనితీరు మారకపోతే కఠిన చర్యలు

- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్
- ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కార్యాలయ సిబ్బంది పనితీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ వెల్లడించారు. గురువారం సాక్షిలో 'ఉదయగిరా.. మాకొద్దు మహాప్రభో..!' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి పీడీ స్పందించారు. ప్రాజెక్ట్ పరిధిలో తనిఖీలు చేశారు. అందుబాటులో ఉన్న సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఉదయగిరి ప్రాజెక్ట్ నిర్వహణ తీరు దారుణంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. పర్యవేక్షణ లోపంపై సూపర్‌వైజర్లను మందలించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం అన్ని కేంద్రాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించి కేంద్రాలు తెరవాలని తెలిపారు. లబ్ధిదారులకు వచ్చిన పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో అధికారులు, సిబ్బంది గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తర్వాత పీడీ మీడియాతో మాట్లాడారు. ఉదయగిరి ప్రాజెక్ట్‌లో కొంత సమస్య ఉన్న మాట వాస్తవమేనన్నారు. దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక్కడ సీడీపీఓ, తగినంత మంది సూపర్‌వైజర్లు లేకపోవడంతో పర్యవేక్షణ లోపం ఉన్నట్లు చెప్పారు. త్వరలో అనంతసాగరం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతిని ఇన్‌చార్జిగా నియమిస్తామన్నారు. త్వరలో జరిగే బదిలీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తారని వెల్లడించారు.


సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న పీడీ